క్లుప్తంగా

నేటి నగరపాలక సంస్థ 'స్పందన' వాయిదా

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ను సోమవారం కౌన్సిల్ హాలులో ప్రవేశపెట్టనున్న దృష్ట్యా స్పందన కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సమస్యలపై ఫిర్యాదుల్ని 0863–2345103కి లేదా 9849908391 నంబర్లకు వాట్సాప్ చేయాలని ఆమె సూచించారు.

నేడు వార్షిక బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ సమావేశాన్ని సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో నిర్వహించనున్నట్లు మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సభలో నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు హాజరవుతారని ఆయన తెలిపారు.

అలరించిన సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శివసాయి చారిటబుల్ ట్రస్టు నిర్వహణలో విజయవాడ, గుంటూరు గాయకుల సహకారంతో అభినందన ఫౌండేషన్ అనాథ శరణాలయం సహాయార్థం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. గాయనిలు మునిపల్లె రమణి, నేరెళ్ల చందన, అత్తోట సౌజన్య, బెల్లంకొండ భారతి, జరీన కమల్, విజయలక్ష్మి సినీ పాటల్ని ఆలపించారు. అనంతరం నిర్వాహకులు గాయనిలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ పరిషత్ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, వెహికల్ ఇన్‌స్పెక్టర్ యన్. శివనాగేశ్వరరావు, బిల్లా అశోక్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు ఈస్ట్: డీ–13 సెక్షన్ పరిధిలోని పలు కాలనీలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్.ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. లైన్ల మరమ్మతుల దృష్ట్యా షాపు ఎంప్లాయీస్ కాలనీ, రాహుల్ గాంధీనగర్, రజకుల కాలనీ, ఎల్‌వీ నగర్, విజయవాడ ఈస్ట్ సైడ్ రోడ్డు, ఎన్‌టీఆర్ నగర్, సీతానగరం ఒకటో లైను, మంగళదాస్ నగర్‌లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆనందపేట 7వ లైన్‌లో నివసించే షేక్ నజీర్ (30) మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



గుంటూరు ఈస్ట్: మహిళ అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శారదా కాలనీ 24వ లైనుకు చెందిన 28 సంవత్సరాల మేడా మరియమ్మ ఈ నెల 8న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని కుటుంబసభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామిరెడ్డినగర్‌లో బాలిక...

గుంటూరు ఈస్ట్: బాలిక అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డినగర్ 1వ లైన్‌లో నివసించే 14 సంవత్సరాల బాలిక ఈ నెల 6న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 86888 31340కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కన్నుల పండువగా రథోత్సవం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని శివాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదానాన్ని జరిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొన్నారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కుట్రలు, కుతంత్రాలతో

చంద్రబాబు, కాంగ్రెస్ అండ్ కో

- ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి
- ప్రజల విశేష ఆదరాభిమానాలతో దూసుకెళ్తున్న సీఎం వైఎస్.జగన్
- సువర్ణ అక్షరాలతో లిఖించదగిన సరికొత్త అధ్యాయాలు 'సిద్ధం' సభలు
- గుంటూరు నుంచి భారీగా తరలిన పార్టీ నేతలు, విద్యార్థులు



గుంటూరులో కార్ల ర్యాలీ

నగరంపాలెం: చంద్రబాబు అండ్ కో, కాంగ్రెస్ అండ్ కోకు కుట్రలు, కుతంత్రాలు మినహా విధి విధానాలు, సిద్ధాంతాల్లేవని ప్రభుత్వ విప్, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. అద్దంకి మండలం మేదరమెట్లలో ఆదివారం జరిగిన జగనన్న సిద్ధం మహాసభకు హాజరయ్యేందుకు వైఎస్ఆర్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యాన గుంటూరు నుంచి పెద్దసంఖ్యలో వాహనాల్లో వేలాది విద్యార్థులు రోడ్డు మార్గాన బయలుదేరారు. బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంప్ కార్యాలయం నుంచి భారీగా బయలుదేరిన వాహనాలకు ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ, జాతీయ కాంగ్రెస్ పార్టీలన్నీ కూడా వైఎస్. జగన్‌ను మళ్లీ సీఎం కానీవ్వకుండా అడ్డుకోవాలనే దురాలోచనతో మూకుమ్మడిగా దుష్టపన్నాగాలతో ముప్పేట దాడులు చేస్తున్నాయని మండిపడ్డారు. అయితే, అశేష ప్రజల విశేష ఆదరాభిమానాలతో ముందుకు సాగుతున్న ఆయనన ముందు వారి ఆటలు సాగవని చెప్పారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ సరికొత్త అధ్యాయాలుగా జగనన్న సిద్ధం సభలు అని అభివర్ణించారు. కుల, మతం, ప్రాంతం, వయసుతో సంబంధం లేకుండా అన్నివర్గాల ప్రజలతోపాటు ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రజాతంత్ర వాదులు సైతం సిద్ధం సభల్లో భాగస్వామ్యమైన వాతావరణం కనిపిస్తోందని చెప్పారు. ఎక్కడికక్కడే ఈ సభలు భారీగా విజయవంతం కావడంతో అన్ని రాజకీయ పార్టీలు, నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఒక మాట ఇస్తే దాన్ని నెరవేర్చడం కోసం సీఎం వైఎస్.జగన్ ఎంత వరకైనా ముందుకెళ్తారనే భావన రాష్ట్ర ప్రజలందరిలో బలంగా నాటుకుందని అన్నారు. దానికి నిదర్శనంగా పార్టీ మేనిఫెస్టోను పవిత్రమైన భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావిస్తూ 99 శాతం పైబిలుకు హామీల్ని అమలు చేసిన వాస్తవాన్ని ఆయన గుర్తుచేశారు. సంక్షేమ పథకాల అమలుతో పేదల జీవితాల్లో స్పష్టమైన మార్పులు తీసుకువచ్చిన వైఎస్.జగన్ వంటి నాయకుడు ప్రపంచంలో మరొకరు లేరని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జరగనున్న ఎన్నికల్లో చెంప చెళ్లుమనే విధంగా ప్రజలే విపక్షాలకు తమ ఓటుహక్కుతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అప్పిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ బత్తుల దేవానంద్, విద్యార్థి విభాగం నేతలు విఠల్, వినోద్, గంటి, బాజి, జగదీష్, రవి, నాయకులు నూనె ఉమామహేశ్వరరెడ్డి, షేక్ రబ్బాని, పరసా కృష్ణారావు పాల్గొన్నారు.

'డైక్' సాయంతో వినికిడి సమస్యలకు చెక్

- గుంటూరు డైక్ సెంటర్‌లో కార్పొరేట్ వైద్యం
- ఉచితంగానే ఆపరేషన్లు, యంత్రాల పంపిణీ
- 15లోపు దరఖాస్తు చేసుకోవాలి



గుంటూరు జీజీహెచ్‌లో డైక్ సెంటర్

2015 నుంచి ఉచిత వైద్యసేవలు

గుంటూరు మెడికల్: వినికిడి లోపమనేది ఏ వయస్సులోనైనా రావొచ్చు. దీన్ని సకాలంలో గుర్తించి నివారించే ఆధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. పిల్లల్లో జన్యుపరమైన కారణాలతో, బిడ్డ గర్భంలో ఉండగా తల్లికి సోకే వ్యాధుల వల్ల వినికిడి సమస్య వస్తుంది. వినే సామర్థ్యం లేకపోవడంతో మూగవారిగా మారిపోతారు. సమస్యల్ని చిన్న వయస్సులోనే గుర్తిస్తే త్వరగా నివారించవచ్చు. గుంటూరు జీజీహెచ్ ఆవరణంలో ఉన్న జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డైక్)లో వినికిడి సమస్యలున్న చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నారు.

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా 2015లో డైక్ సెంటర్‌ను గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటుచేశారు. వినికిడి సమస్యలున్న చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ ఆపరేషన్లు కూడా చేయిస్తున్నారు. ఆదివారం మినహా ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వినికిడి పరీక్షలైన బెరా టెస్ట్, స్పీచ్ ఎసెస్మెంట్ టెస్టులు చేసి స్పీచ్ థెరపీ కూడా ఉచితంగా చేస్తున్నారు. 2023లో 80మంది చిన్నారులకు రూ.30 లక్షలు ఖరీదు చేసే వినికిడి పరికరాల్ని ఉచితంగా అందజేశారు. దీంతో పాటు రూ. 16 లక్షలు ఖరీదు చేసే కాక్లియర్ ఆపరేషన్లను కూడా కార్పొరేట్ ఆస్పత్రుల్లో డైక్ సెంటర్ ద్వారా ఉచితంగా చేయించారు.

వినికిడి సమస్యలకు కారణాలు

పుట్టుకతో వినికిడిశక్తి లోపానికి ప్రధాన కారణం జన్యుపరమైనవే. శబ్ద కాలుష్యం ద్వారా 16 శాతం మందిలో లోపం వస్తుంది. 70 శాతం మేనరికపు వివాహాల వల్ల వస్తాయి. మిగతావారికి నవజాత శిశువుగా ఉన్నప్పుడు కామెర్ల వ్యాధి సోకడం, ఆక్సిజన్ లోపం కారణం. గర్భిణిగా ఉన్న సమయంలో వైరల్ ఫీవర్ ఇతర వ్యాధుల వల్ల పుట్టే పిల్లలకు వినికిడి సమస్యలు వస్తాయి. కాన్పు కష్టంగా ఉన్నా, పుట్టిన వెంటనే కామెర్లు అవ్వడం వల్ల కూడా సమస్యలు వస్తాయి.

ఉచితంగా కాక్లియర్ ఆపరేషన్లు



వినికిడి సమస్యలున్న పిల్లలకు ఆదివారం మినహాయించి ప్రతిరోజూ ఉదయం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డైక్ సెంటర్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు అందిస్తున్నాం. రూ 16లక్షల ఖరీదు చేసే కాక్లియర్ ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తున్నాం. తెల్ల రేషన్ కార్డు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకార్డు లేకపోయినా అన్ని సేవలు ఉచితంగా అందిస్తున్నాం. వైద్యసేవల్ని పొందాలనుకునేవారు, 0863–3581196 నంబర్‌లో సంప్రదించాలి.

– నవ్య, ఆడియాలజిస్టు అండ్ స్పీచ్ థెరపిస్టు

పేర్లు నమోదు చేయించుకోవాలి



డైక్ సెంటర్‌లో 19 సంవత్సరాల్లోపు వయస్సు వారికి ఉచితంగా వినికిడి పరీక్షలు చేయించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నాం. ఈనెల 15వ తేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవాలి. ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, కుల, సదరం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం అందించాల్సి ఉంటుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకునేందుకు, సందేహాలు నివృత్తి చేసుకునేందుకు 9642382249, 8341812131 నంబర్లలో సంప్రదించాలి.

– డాక్టర్ అమృతలూరు శ్రావణ్‌బాబు, డైక్ సెంటర్ ఇన్‌చార్జ్, గుంటూరు

వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్యాయత్నం



ఏడుకొండలు

గుంటూరు రూరల్: సహ జీవనం చేసిన మహిళ పెళ్లి చేసుకోవాలని వేధిస్తుండటంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లపాడు పోలీసు స్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు మండలం వెనిగళ్ల గ్రామానికి చెందిన చల్లా ఏడుకొండలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గతంలో కృష్ణా జిల్లా ఏ కొండూరు మండలం కంభంపాడుకు చెందిన సౌజన్యతో కలసి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంటెక్ చదివాడు. చదువుకున్న రోజుల్లో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. సౌజన్య గతంలో వివాహం చేసుకొని భర్త నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటోంది. ఇరువురుకి విద్యాభ్యాసం అనంతరం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు రావడంతో ఇద్దరూ హైదరాబాద్ వెళ్లారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలోనూ ఇద్దరూ సహజీవనం చేశారు. ఈ క్రమంలో సౌజన్య హైదరాబాద్‌లో ఫిబ్రవరి నెలలో ఏడుకొండలు తనను పెళ్లి చేసుకోవడం లేదని, తనపై అత్యాచారం చేశాడంటూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం ఏ కొండూరు మండల పోలీసు స్టేషన్‌లోనూ ఏడుకొండలపై సహజీవనం చేస్తూ మోసం చేశాడంటూ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఏడుకొండలు గుంటూరులో ఉన్న తన అక్క ఇంటికి వచ్చాడు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్తూ నగర శివారులో పొలంలో పురుగుల మందు సేవించాడు. సౌజన్య తనను వేధిస్తుందని లైవ్ వీడియో రికార్డు చేసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు పంపాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనపై నల్లపాడు పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నిడమర్రులో జిల్లా ప్రజా ఆరోగ్య పరిరక్షణ సమితి, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేదలకు ఉచితంగా కంటి వైద్యం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. శిబిరంలో 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థినులకు ఉపకార వేతనాల పంపిణీ



స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంఘు నాయకులు

గుంటూరు రూరల్: నగర శివారులోని అమరావతి రోడ్డులోని రఘుపతి వెంకటరత్నం నాయుడు కాపు విద్యార్థి వసతి గృహంలో ఆంధ్రప్రదేశ్ తెలగ అభ్యుదయ సంఘం (ఆప్తా) ఆధ్వర్యంలో కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేపట్టారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆప్తా మెంబర్ సింగంశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు రూ.50 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు గోన శివ, బెల్లకొండ ప్రభాకర్, విజేత శ్రీహరి, స్పెక్ట్రం ఐఏఎస్ అకాడమీ అధినేత పోతు రాజు, ప్రణయ్, నారిశెట్టి కృష్ణారావు, శోడ శివ రామ్ పాల్గొన్నారు.

కాపు జాగృతి కమిటీ ప్రమాణ స్వీకారం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా ఏర్పడిన కాపు జాగృతి కమిటీ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాపు జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాజకీయాలకు అతీతంగా కాపులు అంతా సమైక్యంగా కలసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. పెనుమాక కాపు జాగృతి అధ్యక్షులుగా కోటిపల్లి తిరుమలరావు, సెక్రటరీగా పోలిశెట్టి నరసింహారావు, కోశాధికారిగా ముప్పెర ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శిగా చెక్కా నాని, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పోలిశెట్టి వాసు, ముప్పెర శేషు, చెక్కా సతీష్, ఈమని సురేష్, తోటకూర ప్రభాకర్, ముప్పెర కృష్ణలను ఎన్నుకున్నారు.

పవర్ లిఫ్టింగ్ అకాడమీ ప్రారంభం

పాల్గొన్న ఎమ్మెల్సీ హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే, పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా అల్మాస్



పవర్ లిఫ్టింగ్ అకాడమీని ప్రారంభిస్తున్న క్రీడాకారిణి సాదియా అల్మాస్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని తెనాలి రహదారిలో గుమ్మడి పుల్లేశ్వరరావు పవర్ లిఫ్టింగ్ అకాడమీ ప్రారంభోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే) హాజరయ్యారు.ఎంటీఎంసీ అధికారులతో కలసి పవర్ లిఫ్టింగ్ అకాడమీని అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా అల్మాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.52 లక్షల వ్యయంతో ఈ అకాడమీని నిర్మించామన్నారు. క్రీడా వేదికకు ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ సాదియా అల్మాస్ పేరును పెట్టామని అన్నారు. గుమ్మడి పుల్లేశ్వరరావు పేరు చెబితే మంగళగిరిలో తెలియనివారు లేరని అన్నారు. మంగళగిరికి చెందిన చంద్రిక, సాధియా అల్మాస్ వంటి మహిళలు జాతీయ, అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో గోల్డ్ మెడల్స్ సాధించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. అనంతరం పవర్ లిఫ్టర్ సాదియా అల్మాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ర కులాధిపత్య భావజాలాన్ని ఎదిరిద్దాం

కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ



సభలో మాట్లాడుతున్న కృష్ణ

పాత గుంటూరు: అగ్రకులాధిపత్య, మనువాద, పితృస్వామ్య, భావజాలానికి వ్యతిరేకంగా పోరాడటమే సావిత్రీబాయి పూలేకి ఇచ్చే ఘనమైన నివాళి అని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె. కృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో బ్రాడీపేట సీపీఎం కొరటాల సత్యనారాయణ భవనం సమావేశ మందిరంలో ఆధునిక భారతదేశ తొలితరం మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రస్థాయి మహిళా చైతన్య సదస్సు నిర్వహించారు. కావలి జయమ్మ అధ్యక్షతన వహించారు. మహిళలు, మనస్మృతి అంశంపై మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు బి. సాంబశివరావు మాట్లాడారు. నిత్యం అన్యాయం, అణిచివేత, దోపిడీ, దౌర్జన్యాలకు గురవుతున్న అంటరాని మహిళల చైతన్యానికి విద్య అవసరం అని గుర్తించి దాన్ని నేర్పిన మహా మనిషి సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు సి.ఎస్.ఆర్. ప్రసాద్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి. వెంకటరావు, కోశాధికారి కావలి బాలయ్య, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, సుబ్బారాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వరరావు, పీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి. కొండారెడ్డి, ప్రజా కళామండలి రాష్ట్ర కార్యదర్శి జె.కోటితో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. ప్రజా కళామండలి కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైతు వ్యథలు, కన్నీటి దర్పణం 'మట్టి బండి'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుబ్బారావు, నాలేశ్వర శంకరం తదితరులు

గుంటూరు: ప్రకృతి అనుకూలించక, నకిలీ విత్తనాలు, పురుగు మందులు, గిట్టుబాటు ధరలు లేక అన్ని రకాలుగా దోపిడీకి గురవుతున్న రైతు వ్యథల కథల కన్నీటి దర్పణం 'మట్టి బండి' పుస్తకమని ప్రముఖ విద్యా, సాహితీవేత్త డాక్టర్ నాలేశ్వరం శంకరం పేర్కొన్నారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం శ్రీ పద్మావతి కల్యాణ మండపంపై ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మూడో ముద్రణ 'మట్టి బండి' పుస్తకం ఆవిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. సభకు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని గుళ్లపల్లి సుబ్బారావు ఆవిష్కరించారు. అరసం జాతీయ కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, అమరావతి సాహిత్య మిత్రులు కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మి, డాక్టర్ జక్కంపూడి సీతారామారావు సమీక్షించారు. కార్యక్రమంలో చిట్టినేని కోటేశ్వరరావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ఏనుగు సుబ్రహ్మణ్యం నాయుడు, పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, రచయితలు, కవులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం



పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి జేవీ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్–1 విభాగ ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలో చేపట్టిన వారం రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం స్థానిక నగరపాలకసంస్థ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో యువతరం పాత్ర, దేశాభివృద్ధికి ఆవశ్యకతను తెలియజేశారు. గ్రామాలు, వార్డులలో సామాజిక సేవా కార్యక్రమాల్ని నిర్వహించడం ద్వారా విద్యార్థులు ప్రజలతో మమేకం కావడంతో విద్యాపరంగా, సామాజికంగా ముందుకు వెళతారని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్–1 విభాగ కార్యక్రమ నిర్వహణాధికారిణి ఎం. సంతోష్‌కుమారి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి



సుల్తానాను అభినందిస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీత, మహిళ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

గుంటూరు మెడికల్: సమాజంలో అట్టడుగునున్న బడుగు, బలహీన వర్గాలకు చేయూతనిచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర మహిళ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానాను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు కార్పొరేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సమయంలో పేదలకు నామమాత్రపు ఫీజులతో డాక్టర్ షమ సుల్తానా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కేవలం రూ. 10లకే ఓపీ ఫీజు, ల్యాబ్ పరీక్షల్లో 50 శాతం రాయితీతో తాము వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ షమ సుల్తానా తెలిపారు. కార్యక్రమంలో హోప్‌విన్ హాస్పిటల్స్ మేనేజర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివరామిరెడ్డి

లక్ష్మీపురం: రాబోయే ఎన్నికలకు ముందుగానే రాజకీయ పార్టీలకిచ్చిన ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని, ఎస్‌బీఐ గడువు అడగడం ప్రజాభిప్రాయాన్ని, సుప్రీం ఆదేశాల్ని బేఖాతర్ చేయటమేనని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫలమైందని తెలిపారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ఎస్‌బీఐ అధికారులు కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికిలోనై జూన్ 30 వరకూ సమాచారం ఇవ్వడానికి సమయం అడిగారన్నారు. ఎన్నికలు ముగిసే వరకు బాండ్ల వివరాలు వెల్లడించకుండా పన్నిన పన్నాగంలో భాగమే ఇదని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీర్ ఎన్.సదాశివం, అధ్యాపకులు కె.జయకుమార్, విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య ప్రసంగించారు.